క్లుప్తంగా

## బాలికల గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని హయాతీనగరంలో ఉన్న మహాత్మా జ్యోతి భాపూలే వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు అర్హులైన బాలికల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 31వ తేదీలోగా ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్ పోర్టల్‌లో దరఖాస్తులను చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 27వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. బీసీ, ఈబీసీ బాలికలు 2013 సెప్టెంబర్ ఒకటి నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్య, ఎస్సీ, ఎస్టీ బాలికలు 2011 సెప్టెంబర్ ఒకటి నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలని సూచించారు.

## వెంకన్న ఆదాయం రూ. 2.71 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతీపేట నారాయణ తిరుమల కొండపై వేంచేసిన వెంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ. 2,71,582 వచ్చినట్లు ఆలయ ఈవో శ్యామలరావు బుధవారం తెలిపారు. ఈ ఆదాయం 76 రోజులకు వచ్చినట్లు పేర్కొన్నారు. దేవదాయశాఖ తరఫున సూపర్‌వైజర్‌గా ఈవో మాధవి, ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, వెంకటేశ్వర సేవాదళ సభ్యులు పాల్గొన్నారు.

## ఓటును వినియోగించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: అర్హులందరూ తమ ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఏపీఎం సుజాత అన్నారు. సింగుపురం గ్రామంలోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఓటు హక్కుపై బుధవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఓటు వేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సీసీలు, వీఏవోలు పాల్గొన్నారు.

## విజయగణపతికి సహస్ర కలములతో పూజలు


విజయగణపతి వద్ద ఉంచిన కలములు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతి ఆలయంలో 1001 కలములతో స్వామివారికి ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో విద్యార్థులు పరీక్షలకు హాజరై బాగా రాసేందుకు ప్రత్యేకంగా పూజలు చేశారు. కలములను విద్యార్థులకు అందచేస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే గణపతి హోమం కూడా జరిగింది. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

## ఇళ్ల పట్టాల పంపిణీ


ఇళ్ల పట్టాలతో లబ్ధిదారులు

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెంలో ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ పూర్తిచేసిన పూర్తి హక్కు పత్రాలను కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లిపల్లి తిరుపతిరావు లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. ఇళ్ల త్వరితగతిన నిర్మాణం చేపట్టాలన్నారు. దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో అర్హులకు ఇళ్ల పట్టాలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ముగ్గురు మహిళలపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం గ్రామానికి చెందిన దుంప లక్ష్మిపై బుధవారం ముగ్గురు మహిళలు (సమీప బంధువులు) కలిసి దాడి చేశారు. భూతగాదా కొట్లాటకు దారితీసింది. లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేశ్వరి, సావిత్ర, ఎర్రమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎచ్చెర్ల పోలీసులు తెలిపారు.

# చంద్రబాబును నమ్మవద్దు

● మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

గార: చంద్రబాబును ఎవరూ నమ్మవద్దని మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నవరత్నాల పథకాలను అమలుచేశారన్నారు. అయితే మళ్లీ ఏడాది నుంచి ఇవ్వరని, ఆ మరుసటి ఏడాది ప్రజలను సోమరపోతులు చేస్తున్నారని, తరువాత శ్రీలంక, వెనిజులా మాదిరిగా తయారువుతుందని, ఆ తర్వాత మేం కూడా సంక్షేమ పథకాలను ఇంతకన్నా ఎక్కువ చేస్తామని చెబుతున్న చంద్రబాబు ఆలోచన సరళిని మహిళలు అర్థం చేసుకోవాలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ చేయూత సంబరాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 6,661 మంది మహిళలకు మంజూరైన రూ. 12.41 కోట్లకు సంబంధించిన నమూనా చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్ల పుట్టింట్లో ఉన్నంతవరకూ తండ్రి తన ఆలనా పాలనా చూస్తారని, పెళ్లయ్యాక మెట్టినింటిపై ఆధారపడతారన్నారు. నిస్సహాయులుగా ఉండే మహిళలు 45 ఏళ్ల తర్వాత ఎవ్వరికి భారం కలిగించకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వమే చేయూత ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మహిళా సభ్యురాలు బొడ్డేపల్లి పద్మజ మాట్లాడుతూ.. ధర్మాన ప్రసాదరావు లాంటి వ్యక్తిని శ్రీకాకుళం నియోజకవర్గ ప్రజలు గెలిపించి రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే విధంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. ధర్మాన ఉన్నత ఆలోచన వలనే 80 అడుగుల రోడ్డు, రిమ్స్, యూనివర్సిటీ, బ్రిడ్జిలు జిల్లా కేంద్రానికి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, ఎంపీపీ గొండు రఘురాం, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, మండల ప్రత్యేకాధికారి బి.రమణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు మార్పు సుజాతమ్మ, పార్టీ నాయకుడు మార్పు ధర్మారావు, కన్వీనర్ పీస గోపి, మార్పు పృథ్వీరాజ్, బరాటం నాగేశ్వరరావు, అరవల రామకృష్ణ, అందవరపు బాలకృష్ణమూర్తి, పీస శ్రీహరిరావు, సుంకాన సురేష్ పాల్గొన్నారు.


పాల్గొన్న మహిళలు

# మహిళల ఆర్థిక ప్రగతికి చేయూత


ఎచ్చెర్ల క్యాంపస్: చేయూత నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళల ఆర్థిక ప్రగతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పొన్నాడ గ్రామంలో బుధవారం నాలుగో విడత వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 7,188 మందికి రూ.13.48 కోట్ల చెక్కును అందజేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి ఎన్నికలకు వెళుతుందన్నారు. మహిళల పేరిట ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు చేసి స్థిరాస్తి చేకూర్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకులు అంధవరపు సూరిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకర్, పార్టీ కార్యాలయం ఇన్‌చార్జి మురళీధర్‌బాబా, నాయకులు బొడ్డేపల్లి సుధాకర్, అంబటి రాంబాబు, బగ్గురాజారావు, గుండ భాగ్యశ్రీ, బూరాడ చిన్నారావు, పైడి శ్రీలత, నేతింటి నీలమప్పడు, పొన్నాడ సర్పంచ్ నేతింటి యమున, ఎంపీటీసీలు అల్లు తులసీరావు, పప్పల రాజేశ్వరి, ఎంపీడీఓ రమాదేవి, వెలుగు ఏసీ రవికుమార్, ఏపీఎం రమణ మూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేసి, మరోసారి జగనన్నను సీఎం చేయడానికి కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని వాండ్రంగి, ఆనందపురం, సంతవురిటి, పాలఖండ్యాం, టి.డి.వలస, మెట్టవలస, సీతంపేట, పెంట గ్రామాల్లో బుధవారం కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. పేదలకు మేలు జరగకుండా ఉండేందుకు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, కన్వీనరులు, గృహసారధులు తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో లావేరు పీఏసీఎస్ చైర్మన్ బూరాడ చిన్నారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామ్మూర్తి, పిల్లల శివకుమార్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరరావు, చిత్తిరి మోహన్, ఇజ్జి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌కు అండగా నిలవాలి


పరిమళకు తిలకం దిద్దుతున్న మాజీ ఎంపీపీ మీసాల లక్ష్మి

జి.సిగడాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సతీమణి పరిమళ ప్రజలను కోరారు. ఎస్.పి.ఆర్.పురం, గదబపాలెం గ్రామాల్లో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మరోసారి సీఎంను చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠంనాయుడు సతీమణి మాజీ ఎంపీపీ లక్ష్మి, మండల మహిళా కన్వీనర్లు కంది రమాదేవి, గురాన మానస, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


కవాతు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్, సీఆర్‌పీఎఫ్ దళాలు

రణస్థలం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలి జే.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు కోరారు. మండలంలోని చిల్లపేటరాజాంలో సీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ దళాలు, జే.ఆర్.పురం పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

## క్రీడాకారిణికి మంత్రి ధర్మాన అభినందన


శిరీషను అభినందిస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: ఉషా క్రీడాకారిణి ముద్దాడ శిరీషను మంత్రి ధర్మాన ప్రసాదరావు పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం అభినందించారు. గతనెల 24న రాంచీలో జరిగిన ఖేలో ఇండియా జాతీయస్థాయి పోటీలో సీనియర్ విభాగం తరఫున శిరీష తలపడి కాంస్య పతకం సాధించింది. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

## అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ధర్మారావు దంపతులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని గుమ్మడాం పంచాయతీ వేణుగోపాలపురం ఎస్సీ కాలనీలో భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ట కోసం బుధవారం స్థానిక సర్పంచ్ దుర్గాశి ధర్మారావు, భార్గవి దంపతులు భూమిపూజ చేశారు. దుర్గాశి వరలక్ష్మి, గంధవరపు పైడయ్య, జగ్గరోతు తవిటినాయుడు, పెద్దలు, రేగి ఇల్లయ్య, కృష్ణ, సూరి రాములు, యువకులు తదితరులు పాల్గొన్నారు

# పార్టీలకతీతంగా సీఎం జగన్ పాలన

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్


సమావేశానికి హాజరైన మహిళలు

రణస్థలం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా పరిపాలన సాగిస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని జే.ఆర్.పురం పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ సిబ్బందితో ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయిలో ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుతో అందజేసి ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేశారన్నారు. ప్రతి పథకం అక్కచెల్లెమ్మల అకౌంట్‌లోనే వేస్తూ మహిళ సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. దేశంలోనే మహిళల పేరుతో అత్యధిక సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించడంలో సీఎం జగన్‌ది ప్రత్యేక స్థానమన్నారు. ఉపాధి హామీ, అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించేలా చూస్తామన్నారు. అనంతరం ఈ సమావేశంలో నాలుగు మండలాల ఉపాధి హామీ, స్త్రీ, శిశు సంక్షేమ సిబ్బందికి వస్త్రాలను పంపిణీ చేశారు.

# కనువిందుగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


అభిషేకాల కోసం ఏర్పాటు చేసిన శతకలశాలు


అభిషేక కలశాలను తీసుకెళ్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండ రామాలయంలో మూడురోజులగా అష్టోత్తర శత కలశస్నపన సుదర్శనేష్టి సహిత కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణ వేడుకలు భక్తులకు కనువిందు చేశాయి. పాంచరాత్రాగమ ప్రతిష్టాపనాచార్యులు చామర్తి శ్రీనివాచార్యులు ఆచారత్వంలో, ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి శేషాచార్యుల ఆధ్వర్యంలో నిత్య తిరువారాధన, మంగళాశాసనం అనంతరం అష్టోత్తర శత కలశాలతో పవిత్ర నదీజలాలు, సముద్రజలం, పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, పళ్ల రసములు, సర్వ ఔషధలతో, వేద మంత్రాలతో అభిమంత్రించిన జలములతో మూలవిరాట్‌కు అభిషేకాలు జరిగాయి. అనంతరం సీతారాముల ఉత్సమూర్తులను వేదకపై ఉంచి సంప్రదాయ బద్ధంగా కల్యాణాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, కోదండరామ భక్తబృందం, ఆలయ ఈవో గురునాథరావు పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కల్లుగీత కార్మికులను ఆదుకోవాలని శ్రీశయన సంఘం అధ్యక్షుడు మెండ శాస్త్రి అన్నారు. శ్రీకాకుళం, తోటపాలెం, అలికాం, శ్రీకూర్మం, చెల్లయ్యవలస, అంపోలు సొసైటీల అధ్యక్షులు, సభ్యులతో స్థానిక గురిటి పోలమ్మ ఆవరణలోని ఫంక్షన్ హాల్లో కల్లు గీత కార్మికుల సమావేశం బుధవారం జరిగింది. మెండ శాస్త్రి, డీసీసీబీ ఏజీఎం దశరథరామయ్య హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ.. గీత కార్మికులు అత్యంత దయనీయమైన స్థితిలో ఉన్నారన్నారు. బ్యాంకు ద్వారా రుణాలు, ప్రభుత్వం ద్వారా ఏదో ఒక చేయూత పథకం మంజూరు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, గూరు జగదీష్ (అబ్బు), గొండు నీలాద్రి, అలిగి గోదావరి, దుబ్బ కోటేశ్వరరావు, గుజ్జల హిమగిరి, కోట అప్పారావు, నాగశివ, కర్రి రంగాజిదేవ్, చింతనిప్పుల రాజేంద్ర, మెండ రాంబాబు, ఇర్రి అచ్చెన్న, దండాశి జ్యోతిభాస్కర్ ఉన్నారు.

# విద్యతోనే ఆర్థిక, సామాజిక ప్రగతి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయలక్ష్మి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యతోనే మహిళలకు ఆర్థిక, సామాజిక ప్రగతి సాధ్యమని విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికల చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆసక్తి గల రంగాల్లో మహిళలను ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలు, లింగ వివక్షత వంటివి సమాజంలో పూర్తిగా కనుమరుగు కావాలన్నారు. సమాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో స్వతంత్ర్యంగా వ్యవహరించాలన్నారు. వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమ్మడి శాంతి అధ్యక్షత వహించారు. రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, పిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

# వైభవంగా గ్రామదేవత ఆలయ ప్రతిష్ట


పూజల్లో మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: వమరవల్లి పంచాయతీ కళ్లివానిపేటలో గ్రామదేవత అసిరితల్లి, భూలోక మాత దేవాలయాల ప్రతిష్ట వైభవంగా బుధవారం జరిగింది. మంత్రి ధర్మాన ప్రసాదరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలు వైదిక ధర్మ పరిరక్షణకు దోహదపడతాయని మంత్రి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్, బి.లలిత ఉన్నారు.

# మొల్లమాంబను ఆదర్శంగా తీసుకోవాలి


మాట్లాడుతున్న సత్యం

రణస్థలం: వాల్మీకి రచించిన రామాయణాన్ని తెలుగులో అనువదించి జాతికి అంకితం చేసిన కవయిత్రి మొల్ల నేటి మహిళలకు ఆదర్శమని శ్రీకాకుళం జిల్లా కుమ్మరి వెల్ఫేర్ కమిటీ సభ్యుడు నాగవరపు సత్యం తెలిపారు. మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలి వద్ద కవయిత్రి మొల్ల మాంబ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సమాజంలో మూఢాచారాలను మొల్లమాంబ ధైర్యంగా ఎదుర్కొన్నారని తెలిపారు. నారువ సర్పంచ్ కాటుకుని దేవి, ఏపీ కుమ్మర శాలివాహన సంఘం సభ్యులు వులపల్లి రామారావు, ఉప్పాడ గొల్ల, బిక్కవోలు వెంకటి, నాగవరపు రమణ, వీరవరపు సూర్యనారయణ, రమేష్, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

# మొల్లమాంబ రచనలు అద్భుతం


మొల్లమాంబ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్

శ్రీకాకుళం క్రైమ్: తొలి తెలుగు కవయిత్రి కుమ్మర మొల్లమాంబ రచనలు అద్భుతమని జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్ కాజల్ అన్నారు. మొల్లమాంబ జయంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాల్మీకి రచించిన రామాయణం గ్రంథాన్ని ఆధారం చేసుకుని మొల్లమాంబ సామాన్యులకు అర్థమయ్యేలా తెలుగు భాషలో మొల్లరామాయణం రాయడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి సీహెచ్ గోపీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి నాదనీరాజనంలో ప్రదర్శన


నృత్య ప్రదర్శనలో లయశ్రీ విద్యార్థులు

తిరుపతిలో రోజూ స్వామివారికి జరిగే నిత్య నాదనీరాజనం కార్యక్రమంలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన శ్రీలయశ్రీ నృత్య కళానికేతన్ విద్యార్థులు నృత్యప్రదర్శన బుధవారం చేశారు. నృత్య దర్శకురాలు కె.పరిమళ హరిహర్ ఆధ్వర్యంలో శిష్యులు జె.శ్రీహ, జి.యశశ్వినులు ప్రదర్శన ఇచ్చి అభినందనలు అందుకున్నారు.

శ్రీకాళం కల్చరల్

## అన్ని రూట్లపై అవగాహన ఉండాలి

టెక్కలి: ఎన్నికల విధులు నిర్వర్తించే రూట్ అధికారులు, సెక్టార్ అధికారులకు వారికి కేటాయించిన రూట్‌లపై పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోవాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఆడిటోరియంలో నియోజకవర్గ స్థాయిలో రూట్ అధికారులు, సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు.